సాక్షి
కృష్ణాజిల్లా

బుధవారం । 27 । నవంబర్ । 2024



సత్యవ్రతం శ్రేయోదాయకం

విజయవాడ సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్‌లో నిర్వహిస్తున్న కార్తిక మాస ఉత్సవాలు మంగళవారం ముగిశాయి.

-8లో▸



మ్యూజిక్ ఫెస్టివల్‌కు పక్కా ఏర్పాట్లు

విజయవాడ దుర్గా ఘాట్‌లో డిసెంబర్ 6 నుంచి జరిగే మ్యూజిక్ ఫెస్టివల్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.

-8లో▸



మహా 'రుద్ర'అభిషేకం

నాగాయలంక: కార్తిక బహుళ ఏకాదశి పురస్కరించుకుని కృష్ణానది తీరంలోని శ్రీరామపాద క్షేత్రంలో మంగళవారం రాత్రి రుద్రుడికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నంకు చెందిన భక్తులు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. విశాఖ పట్నంకు చెందిన ఉప్పలపాటి నరేంద్రనాథ్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ డీఈవో రత్నరాజు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

రేపటి నుంచి కేయూలో స్పాట్ అడ్మిషన్లు

కోనేరుసెంటర్: పీజీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థుల కోసం ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎల్.సుశీల తెలిపారు. పీజీ కోర్సులలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షకు హాజరు కాని వారు, అర్హత సాధించని వారు కూడా అర్హులేనని తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తమ సర్టిఫికెట్లతో మచిలీపట్నంకు, నూజివీడు పీజీ సెంటర్ లో చేరదలిచిన అభ్యర్థులు స్వయంగా అక్కడికే వెళ్లి రిపోర్ట్ చేయవచ్చని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా శిల్పారామం

చైర్‌పర్సన్‌గా బాధ్యతలను స్వీకరించిన మంజులారెడ్డి



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శిల్పారామం కేంద్రాలను మరింత అభివృద్ధి చేసే విధంగా తీర్చిదిద్దుతానని శిల్పారామం సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన మాచర్ల పట్టణానికి చెందిన మంజులారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ఆమె మంగళవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా శిల్పారామం సీఈఓ స్వామినాయుడు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తదితరులు ఆమెను అభినందించారు. అనంతరం మంజులారెడ్డి మాట్లాడుతూ శిల్పారామం సొసైటీ కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింప చేసేలా కృషి చేస్తానన్నారు.

ధాన్యం కొనుగోలులో ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యాన్ని విక్రయించటంలో ఎటువంటి ఇబ్బందులు, ఫిర్యాదులు వచ్చినా తెలియజేసేందుకు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంట్రోల్‌రూమ్‌లో సిబ్బంది అందుబాటులో ఉండి రైతుల ఫిర్యాదులు, సందేహాలు, సమస్యలను స్వీకరించి పరిష్కరిస్తారన్నారు. రైతులకు ధాన్యం విక్రయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే ఫోన్ నంబర్ 82476 93551 కు తెలియజేయాలని కోరారు.

ఉత్సాహంగా బాక్సింగ్ ఎంపిక పోటీలు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటీ బాక్సింగ్ ఎంపిక పోటీలు కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. పోటీలను కళాశాల కార్యదర్శి ఎం.మహేంద్రనాథ్, ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, యూనివర్సిటీ స్పోర్ట్స్ కార్యదర్శి శ్యాంకుమార్ ప్రారంభించారు. వివిధ కళాశాలలకు చెందిన 25మంది విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. తుదిపోరులో పోటీపడి ప్రతిభ చాటిన ఐదుగురు యువకులు, నలుగురు యువతులను సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేశారు. ఆర్కే కళాశాలకు చెందిన కోమల అనే విద్యార్థిని కూడా ఎంపికైనట్లు కళాశాల కార్యదర్శి మహేంద్రనాథ్ తెలిపారు.

కూటమి సర్కారుకు నిరసన సెగ

ఆందోళన బాట పడుతున్న కార్మిక వర్గం

అయిదు నెలల కూటమి ప్రభుత్వ పాలన రాష్ట్రంలో అన్ని వర్గాల్లోనూ నిరసన జ్వాలలు రేపుతోంది. అలవి కాని హామీలిచ్చి ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు వాటిని అమలు చేయకపోవడంతో సమాజంలోని వివిధ వర్గాలు ఇప్పటికే నిరసన బాట పట్టాయి. ప్రధానంగా చిరుద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. ఆశ వర్కర్లు, 108, 104 సిబ్బందితో పాటు భవన నిర్మాణ కార్మికులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కి ప్రభుత్వ వైఖరిపై నిప్పులు కక్కుతున్నారు.

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితం
- ధర్నాలు నిర్వహించి నిరసన వ్యక్తం చేస్తున్న చిరుద్యోగులు
- ఆశ వర్కర్లు, 108, 104 సిబ్బందితో పాటు అదే బాటలో పలు వర్గాలు
- ప్రభుత్వం ఏర్పడిన మూడో నెల నుంచే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు
- భవిష్యత్తులో మరింత ఉధృతం చేసేందుకు కార్మిక సంఘాల ప్రణాళిక



ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో సీపీఎం, భవన నిర్మాణ కార్మికుల ఆందోళన (ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారుకు నిరసన సెగ తాకుతోంది. చెప్పిన హామీలు అమలు చేయకపోవడం, చిరు కార్మికులను చిదిమేసేలా చర్యలు చేపట్టడం, నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం, అలవెన్స్‌లు, ఎరియర్స్‌ను విడుదల చేయకపోవడం, వారిని ఉద్యోగాల నుంచి తొలగించి, కాసులు పుచ్చుకొని అయిన వారికి కట్టబెట్టడం, కనీస వేతనాలు లేకపోయినా.. దానిపైనే ఆధారపడి బతికే కార్మికుల పొట్టగొట్టి, ఉపాధి లేకుండా చేయడం వంటి చర్యలతో విసిగిపోయిన కార్మిక వర్గం కదం తొక్కుతోంది. ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి, ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలుపుతోంది. మరోవైపు విద్యుత్ సర్దుబాటు చార్జీలు వేయడం, స్మార్ట్ మీటర్లు పెట్టి స్పాట్ బిల్లింగ్ మీటర్ రీడర్లను ఇంటికి పంపేలా చూడడం వంటి చర్యలతో ఇబ్బందులు పడుతున్న జనం కూడా నిరసనలకు తమ గళాన్ని జత కలుపుతున్నారు. 108, 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు ఆశ వర్కర్లు కార్మిక సంఘాలతో కలిసి బహిరంగంగానే ధర్నాలు చేస్తున్నారు. కలెక్టరేట్‌లు, ప్రధాన సెంటర్లతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సర్కారు అసమర్థతపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా చిరుద్యోగులే బాధితులు

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చిరుద్యోగులు, కార్మికులే తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో పాటు తమ ఉద్యోగానికి ఎసరు పెట్టేలా తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో జరుగుతున్న అన్యాయాలపై ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ వైఖరికి నిరసన తెలుపుతున్నారు. భవిష్యత్తులో మరింత ఉధృతం చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు చెబుతున్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ

వామపక్ష పార్టీల అనుబంధ సంఘాలు, సీఐటీయూ, సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా మచిలీపట్నంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ప్రభుత్వ రంగ వివిధ విభాగాల కార్మికులు, మహిళలు పాల్గొని నిరసన తెలిపారు.



టీచర్ల సర్దుబాటుకు వ్యతిరేకంగా ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయుల నిరసన (ఫైల్)

నాలుగు నెలలుగా కొనసాగుతున్న నిరసనలు

- ఆగస్టు 13న టీచర్ల సర్దుబాటు చేసే నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లాలోని ఉపాధ్యా సంఘాల జేఏసీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఎంఈఓ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టి వినతిపత్రాలు అందజేశారు.
- అక్టోబరు 4వ తేదీన ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీపీఎం, భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగరంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.
- నవంబరు 10వ తేదీన కృష్ణాజిల్లా కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. 104 సర్వీసులను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ప్రతి రోజు ఓ గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న తమకు కనీస వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
- నవంబరు 18న సోమవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద 108లో పనిచేస్తున్న సిబ్బంది నిరసన, ర్యాలీ, రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వమే 108 నిర్వహించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం మారిన ప్రతిసారీ ఏజెన్సీలు మారుస్తుండడంతో జీత భత్యాలు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు కోల్పోతున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- నవంబరు 18న సోమవారం మచిలీపట్నంలోని ఆశ వర్కర్లకు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సంఘంతో నిర్వహించిన జాయింట్ మీటింగ్ హామీలు అమలు చేయాలని, కనీస వేతనం పెంపుదల చేయాలని కోరుతూ మచిలీపట్నం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఒప్పందం ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.6లక్షల గ్రాఫ్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.60వేలు ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

- కిసాన్ సంయుక్త మోర్చ, కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుల పిలుపు
- నగరంలో నిరసన ర్యాలీ, బహిరంగ సభ



కోనేరుసెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న హరిబాబు

మచిలీపట్నంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఈ విధానాలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు దుయ్యబట్టారు. అఖిలపక్ష ట్రేడ్ యూనియన్‌లు, సంయుక్త కిసాన్ మోర్చ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బస్టాండ్ సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనేరుసెంటర్‌లో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజా ధనాన్ని దోచిపెట్టిందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన స్కీం కార్మికులైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన తయారీ కార్మికులను కార్మికులుగా గుర్తించడం లేదని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ టి.తాతయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతులు, కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు జి.రాంబాబు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం తయారీ, వెలుగు నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ తదితర పథకాలలో పని చేస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణ సహాయం అందించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోనేరు సెంటర్లో నిర్వహించిన సభకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లెం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత రైతు సంఘం జిల్లా నాయకుడు గౌరిశెట్టి నాగేశ్వరరావు రాజ్యాంగ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ నాగేంద్రం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం, గ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.ధనశ్రీ , సీపీఎం నాయకులు కొడాలి శర్మ, ఏఐటీయూసీ నాయకుడు లింగం ఫిలిప్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

• రాజ్యాంగం పవిత్ర గ్రంథం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమని, దానిని ప్రతి ఒక్కరూ పఠనం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆమోదించిన దినం సందర్భంగా ఆ రోజున రాజ్యాంగ నిర్మాతను గౌరవించటం, గుర్తించటం కోసమే నవంబరు 26వ తేదీన సంవిధాన్ దివస్‌గా జరుపుకొంటున్నామన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, ఆర్ అండ్ బీ ఈఈ లోకేష్, సీపీవో గణేష్‌కృష్ణ, కలెక్టరేట్ ఏవో వీరాంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి ధరల మంట

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు...
- జిల్లాలో 1,349 వంట ఏజెన్సీలు
- 2,255 మంది వంట ఏజెన్సీ వర్కర్లు
- సరిగా అందని గౌరవ వేతనం, కుకింగ్ కాస్ట్ బకాయిలు
- ఏజెన్సీల వర్కర్లకు భారంగా మారిన వైనం





మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వర్కర్



బిల్లులు రాక నిలిచిపోయిన వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన వంట షెడ్డు

గుడ్లవల్లేరు: రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీ ప్రశ్నార్థకమవుతోంది. వంట ఏజెన్సీల వర్కర్లకు పెను భారంగా పరిణమిస్తోంది. దానికి తోడు గోరుచుట్టు మీద రోకటి పోటులా గౌరవ వేతన బకాయిలు, కుకింగ్ కాస్ట్ బకాయిలను కూటమి ప్రభుత్వం ఇవ్వకుండా తాత్సారం చేస్తోంది. జిల్లాలో 1,349 వంట ఏజెన్సీలు ఉంటే... అందులో 2,255 మంది వంట ఏజెన్సీ వర్కర్లు పని చేస్తున్నారు. విద్యార్థి తల ఒక్కింటికి కుకింగ్ కాస్ట్ వచ్చేసరికి ఎంత పని చేసినా...తోక బెత్తెడే అన్న చందంగా ధరలు పెరగక ముందు ఉన్న రేట్లనే చెల్లించాలని ప్రభుత్వం చూస్తోంది. కాని వాస్తవ రూపంలోకి వచ్చి ప్రస్తుత నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు మార్కెట్లో ఎలా ఉన్నాయో పరిశీలించి తమకు కుకింగ్ కాస్ట్‌ను కేటాయించాలని వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. వంట ఏజెన్సీలో ఒక్కో వర్కర్‌కు నెలకు రూ.3వేల చొప్పున ప్రభుత్వం వర్కర్లకు గౌరవ వేతన బకాయిలను చెల్లించవలసి ఉంది. కాగా 1–8వ తరగతి వరకు సెప్టెంబరులో వేతనం రూ.3వేలలో కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి వాటా మాత్రమే చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2వేలను చెల్లించవలసి ఉంది. 2005 నుంచి అయితే 9–10వ తరగతి విద్యార్థులకు మాత్రం ఎలాంటి వేతనాలను ఇవ్వకుండానే 19 ఏళ్లగా వర్కర్లతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వంట ఏజెన్సీల వర్కర్లు మధ్యాహ్న భోజన తయారీలకు ఏర్పాటు చేసిన వంట షెడ్లకు కూటమి ప్రభుత్వం నిధులు నిలిపివేసి మరుగున పడేసింది. దీనితో వర్కర్లు తమ వంటలను ఇరుకు షెడ్లలో, చెట్ల కింద చేసుకుంటున్నారు. తమ డిమాండ్లపై కూడా గళమెత్తుతున్నారు.

రూ.1.25 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసేందుకు ప్రభుత్వం ఇచ్చే కుకింగ్ కాస్ట్ కూడా అందటం లేదు. 1–8వ తరగతి విద్యార్థులకు సెప్టెంబరు కుకింగ్ కాస్ట్ బిల్లులు రావలసి ఉంది. అక్టోబరులో అయితే 1–10వ తరగతి వరకూ కూడా బిల్లులు రాలేదు. పాత ధరలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం కుకింగ్ కాస్ట్‌ను ఇవ్వటం అన్యాయమని వర్కర్లు వాపోతున్నారు. భోజన తయారీకి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తల ఒక్కింటికి రూ.8.57 అయితే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.5.88 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. కుకింగ్ కాస్ట్‌ను రూ.15నుంచి రూ.20కు పెంచాలని కోరుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెనూకు అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు గౌరవ వేతనాలు, భోజన తయారీకి అయ్యే ఖర్చు చెల్లించేవారని, ఆ మెనూను బట్టి పాఠశాలలకు పిల్లలు వచ్చేందుకు ఆసక్తి చూపేవారని అంటున్నారు. ఇపుడు పెరిగిన ధరలపై ఆ మెనూని ఇవ్వలేమని అంటున్నారు. వేతన బకాయిలు, కుకింగ్ కాస్ట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనని డీఈఓ పి.వి.జె. రామారావు వివరణ ఇచ్చారు. త్వరలో వాటిని చెల్లిస్తామని చెప్పారు. వేతన బకాయిలు, కుకింగ్ కాస్ట్ బిల్లులు వెరశి రూ.1.25 కోట్ల వరకు పెండింగ్ ఉన్నాయన్నారు.


కుకింగ్ కాస్ట్ అందలేదు...



విద్యార్థులకు మధ్యాహ్న భోజన తయారీకి అయ్యే కుకింగ్ కాస్ట్‌ను ఇంకా ప్రభుత్వం మాకు వేయలేదు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలతో వంట చేయడం పెను భారంగా మారింది. ప్రభుత్వం పెద్ద మనసుతో కుకింగ్ కాస్ట్ ధరలను పెంచితే తప్ప వంట చేయలేని పరిస్థితి ఏర్పడింది.

– కె.నదియ, వంట ఏజెన్సీ మహిళ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గుడ్లవల్లేరు

అందని గౌరవ వేతనం...



ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీ మహిళలకు గౌరవ వేతనం ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున ప్రభుత్వం బకాయి పడింది. అలా ఎప్పటికప్పుడు వేతన బకాయిలు ప్రభుత్వం వద్దనే నిల్వ ఉంటున్నాయి. మా వేతనాలను చెల్లించాలి. పాత మెనూ ప్రకారం వంట చేయాలన్నా...కుకింగ్ కాస్ట్‌ను పెంచాల్సిందే.

– పి.రమాదేవి, వంట ఏజెన్సీల వర్కర్ల సంక్షేమ సంఘ జిల్లా కోశాధికారి

క్లుప్తంగా

ఉపాధి పనులను వేగవంతం చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పంచాయతీరాజ్, డ్వామా తదితర శాఖల అధికారులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. పనులు పూర్తయిన అనంతరం సంబంధించిన బిల్లులను సకాలంలో అప్‌లోడ్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీఎస్టీ, జీఎస్టీ యేతర రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో హౌస్‌హోల్డ్ [illegible] వలసలకు సంబంధించిన ఆప్షన్లను యాప్‌లో పొందుపరచాలని [illegible] ఉన్నారు.

చిన్నాపురంలో 35 మూగజీవాలుమృతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): [illegible] మండలంలోని చిన్నాపురం గ్రామంలో మంగళవారం 35 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనపై యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు బందరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిన్నాపురం గ్రామానికి చెందిన మోగంటి సురేష్ బాబు మేకలు, గొర్రెలు మేపుతూ జీవిస్తున్నాడు. గ్రామానికి సమీపంలోని చెరువు గట్లపై వాటిని మేపుతూ రాత్రి పూట పొలంలో ఏర్పాటుచేసిన వలలోకి తోలుతాడు. ప్రతి రోజులానే సోమ వారం రాత్రి జీవాలను వలలోకి తోలాడు. మంగళవారం ఉదయం లేచి చూసే సరికి మంద లోని సుమారు 25 మేకలు, గొర్రెలతో పాటు మరో 10 పిల్లలు అనుమానాస్పదస్థితిలో మృతి చెంది కనిపించాయి. బాధితుడు సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్లార్‌లో గుర్తుతెలియని మృతదేహం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే బీఆర్టీఎస్ రోడ్డులోని ఓ కొరియర్ ఆఫీస్ సెల్లార్‌లో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. గుణదల పోలీసు లకు బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న ఓ కొరియర్ ఆఫీస్ సెల్లార్‌లో గుర్తుతెలియని మృతదేహం ఉందంటూ ఫిర్యాదు వచ్చింది. దీంతో సీఐ వాసిరెడ్డి శ్రీను సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. సెల్లార్ లోతట్టు ఖానాలో సుమారు 40 ఏళ్ల పురుషుని మృతదేహం ఉంది. మూడు రోజుల క్రితమే మరణించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తూ లిఫ్ట్ ఖానాలో పడి మృతి చెందాడా? లేక ఉద్దేశపూర్వకంగా ఎవరైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గుణదల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ వాసిరెడ్డి శ్రీను కోరారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరేశ్వరుడికి వరి సిరి



నాగాయలంకలోని శ్రీ పార్వతి సమేత శ్రీ కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామిని మంగళవారం కొత్తపంట వరి కంకులతో అభిషేకించి, అలంకరించారు. వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల ఇళ్లకు క్షేమంగా పంట చేరాలని కోరుతూ ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు స్వామిని నవధాన్యంతో పూజించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో శ్రీనగరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. వరి కంకుల అలంకరణలో కనిపించిన నగరేశ్వరుడిని భక్తులు దర్శించుకున్నారు.

– నాగాయలంక

సత్యవ్రతం శ్రేయోదాయకం



సత్యదేవుని వ్రతం శ్రేయోదాయకమని తాళ్లాయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి అన్నారు. శత సహస్ర దీపార్చన మండలి ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కార్తిక మాస ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. శివస్వామి మాట్లాడుతూ.. సత్యనారాయణ స్వామి వ్రతాన్ని కుల మతాలకు అతీతంగా చేసుకోవచ్చని సూచించారు. నాగలింగం శివాజీ, అవ్వారు బుల్లెబ్బాయి, ఎ.శేషుబాబు నిర్వహించారు.

– విజయవాడ కల్చరల్

నిలువెత్తు నిర్లక్ష్యం



ఎన్టీఆర్ జిల్లా కేంద్రమైన విజయవాడ నగరంలో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహాశిల్పంపై కూటమి ప్రభుత్వం నిలువెత్తు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం చుట్టూ రకరకాల మొక్కలు పచ్చందాలతో ఇటీవలి వరకు కనువిందు చేశాయి. ఆడిటోరియం, మ్యూజియం, ఫొటోఎగ్జిబిషన్, భారీ వాటర్ ఫౌంటేన్లు సందర్శకులను ఆకర్షించేవి. కూటమి ప్రభుత్వం వీటి నిర్వహణను విస్మరించింది. ఫలితంగా విగ్రహానికి ఒక వైపు మొక్కలు ఎండిపోయి, వ్యర్థాలతో దర్శనమిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రతిభకు పరీక్ష

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగునకు కేంద్రం చర్యలు

- కృష్ణాజిల్లాలో పరఖ్ పర్యవేక్షణకు 124 పాఠశాలలు ఎంపిక
- 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన
- 4న ఎంపిక చేసిన పాఠశాలల్లో పరీక్ష నిర్వహణ

పటమట(విజయవాడపశ్చిమ): మానవ వికాసానికి విద్య ప్రధాన ఆయుధం. అటువంటి విద్యాబోధన ఏ విధంగా కొనసాగుతోంది అనే అంశంపై ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ఆరా తీస్తుంటాయి. ఈ క్రమంలో కృష్ణా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ పేరుతో పరఖ్ రాష్ట్రీయ – సర్వేక్షణ్ – 2024ను (గతంలో నాస్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సర్వేను 2021లో చివరిసారిగా నిర్వహించారు. తిరిగి ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహణకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టాయి. ఇందుకు సంబంధించిన సామర్థ్య పరీక్షను డిసెంబర్ నాలుగో తేదీన జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించనున్నారు.



జిల్లాలో ఇలా..

కృష్ణా జిల్లాలో 124 పాఠశాలలను ఈ పరీక్ష కోసం ఎంపిక చేశారు. ఇందులో ఒక్కో పాఠశాల నుంచి తరగతికి 30 మంది చొప్పున మూడు తరగతులకు సంబంధించిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. పరాఖ్ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా స్థాయి కోఆర్డినేటర్‌గా, డీసీఈబీ సెక్రటరీ సహాయ జిల్లా స్థాయి కో ఆర్డినేటర్‌గా వ్యవహరించనుండగా సమగ్ర శిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్లు ఈ పరీక్షల నిర్వహణకు సహకారం అందించనున్నారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు. పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటాం



పరఖ్ పర్యవేక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సామర్థ్య తెలుస్తుంది. దేశ వ్యాప్తంగా ఈ పరీక్షను డిసెంబరు 4వ తేదీన ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. దీని ద్వారా ఏ రకమైన ప్రాంతాల్లో ఏ రకమైన విద్యార్థుల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకుని జాతీయ విద్యావిధానం- 2020 ద్వారా విద్యార్థులకు బోధనలో మార్పులు, చేర్పులు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. మూడు, ఆరు తరగతుల విద్యార్థులకు సంబంధించి మ్యాథ్స్, లాంగ్వేజ్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, సోషల్ సైన్స్‌పై ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

– పీవీజే రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి

పరీక్షలు ఇలా..

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే పరఖ్ పరీక్షకు ముందుగా ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు ఇస్తారు. ఇందులో మూడు, ఆరు తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, తొమ్మిదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి. మూడో తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 45 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. ఆరో తరగతి విద్యార్థులకు ఐదో తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 51 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎనిమిదో తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 60 ప్రశ్నలతో 120 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. ఓఎంఆర్ షీటు విధానంలో పరీక్ష జరుగుతుంది.

సంక్రాంతిలోగా పనులన్నీ పూర్తి చేయాలి

ఇంజినీరింగ్ పనులపై సమీక్షలో కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్, అంగన్‌వాడీ టాయిలెట్ల పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ వద్దని అధికారులను కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. సంక్రాంతి పండుగలోగా ఈ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని మీ-కోసం హాల్‌లో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను నియోజకవర్గాలు, మండల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. జల జీవన్ మిషన్, ఉపాధి హామీ, సీఎస్ఆర్ పథకాల కింద చేపట్టే పనులకు నిధుల కొరత లేదన్నారు. గత వారానికి జరిగిన పనుల పురోగతి కలెక్టర్ సమీక్షిస్తూ నూరు శాతం గ్రౌండింగ్ జరగాలన్నారు. పంచాయతీ రాజ్‌లో గుడివాడ, గన్నవరం సబ్‌డివిజన్లలో పనుల పురోగతి ఆశాజనకంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్లపై గుంతలను పూడ్చే పనులు వేగవంతం చేయాలని కోరారు. కొత్త పనుల అనుమతుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. టెండర్ ప్రక్రియలో ఉన్న వాటిని త్వరగా పూర్తిచేసి పనులు ప్రారంభించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ చేపట్టిన అంగన్‌వాడీల్లో టాయిలెట్ల నిర్మాణ పనులు గ్రౌండింగ్ ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు చేసేందుకు గ్రావెల్ సమస్య ఉందని అధికారులు తెలుపగా కలెక్టర్ స్పందించి పరిష్కరిస్తామన్నారు. సీఎస్ఆర్ నిధులతో కృత్తివెన్నులో రెండు కమ్యూనిటీహాళ్ల నిర్మాణం మొదలు పెట్టాలని, సంక్షేమ హాస్టళ్ల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన పనులు వర్క్ ఆర్డర్స్ పెండింగ్‌లో ఉంచవద్దని, వచ్చే వారానికి పనుల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని, పనులు కచ్చితంగా రికార్డు చేసి సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేసి, కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణరావు, డ్వామా పీడీ శివప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాయన్న, సీపీఓ గణేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ప్రజాస్వామ్యానికి మూలస్తంభం రాజ్యాంగమేనని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26వ తేదీని గుర్తు చేసుకుంటూ ఏటా రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రాజ్యాంగం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. రాజ్యాంగం ద్వారా పొందిన హక్కులను గౌరవిస్తూ, నిరంతరం విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన అధికా రులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వి.వి.నాయుడు, ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ, పలువురు డీఎస్పీలు, సీఐలు, జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ గంగాధరరావు

అందరికీ ఆదర్శనీయుడు అంబేడ్కర్

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎం.వి.బసవేశ్వరరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాంతాలు, భాషలు, మతాలు, కులాలతో ముడిపడి ఉన్న భారత సమాజం 75 ఏళ్లుగా ఒక్కతాటిపై ఉండటానికి కారణం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమని పేర్కొన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యుడు ఎస్.ఉష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ స్వరూప, డాక్టర్ రవి, డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ కవిత, డాక్టర్ శాంతికృప తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాలీబాల్ టోర్నీకి ఏర్పాట్లు పూర్తి

విజయవాడస్పోర్ట్స్: ఆల్ ఇండియా ఇన్విటేషన్ మహిళల వాలీబాల్ టోర్నీని విజయవాడ కేంద్రంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నాదెళ్ల బసవ పూర్ణయ్య ట్రస్ట్ (ఎన్‌బీపీ) చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీరావు తెలిపారు. డిసెంబర్ 12 నుంచి 15వ తేదీ వరకు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో కొత్తగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ టోర్నీకి సంబంధించిన వివరాలను ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎన్‌బీపీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సెంట్రల్ రైల్వేస్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర,



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టోర్నీ నిర్వాహకులు

గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, ఐసీఎఫ్ (చెన్నయ్), సౌత్ సెంట్రల్ రైల్వేస్, సదరన్ రైల్వేస్ జట్లు లీగ్ పద్ధతిలో జరిగే ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. విజేతలకు రూ.2.75 లక్షల నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేస్తామన్నారు. నగదు బహుమతిని జీఆర్‌జీ ట్రస్ట్(కోయంబత్తూరు) సమకూర్చినట్లు వెల్లడించారు. సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతల సమక్షంలో ఈ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వాలీబాల్ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని కృష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దోనేపూడి దయాకరరావు తెలిపారు. రోజూ నాలుగు మ్యాచ్‌లు చొప్పున నాలుగు రోజులు పాటు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీపీ ట్రస్ట్ సభ్యులు నాదెళ్ల శ్రీనివాస్, నాదెళ్ల సాంబశివరావు, మోనికరావు, డాక్టర్ దేవేంద్రరాజా పాల్గొన్నారు. తొలుత టోర్నీకి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆలస్యానికి వడ్డీ చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): నగదు చెల్లింపు ఆలస్యం కావటంతో ఖాతాదారునికి వడ్డీ చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నందిపాటి పద్మారెడ్డి, సభ్యురాలు శ్రీలక్ష్మి రాయల మంగళవారం తీర్పు చెప్పారు. బంటుమిల్లికి చెందిన జె.వి.ఉమామహేశ్వరరావు కపిల్ చిట్స్ గుడివాడ బ్రాంచ్‌లో 2020లో రూ.2 లక్షలకు చిట్ వేశారు. చిట్ పాడిన అనంతరం చిట్ మొత్తాన్ని 2022లో చెల్లించారు. చిట్ మొత్తం ఆలస్యంగా చెల్లించటంతో వడ్డీ ఇవ్వాలని కోరితే చిట్ ఫండ్ సంస్థ స్పందించలేదు. ఉమామహేశ్వరరావు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు పూర్వాపరాలను విచారించిన అనంతరం.. చిట్ మొత్తంపై 9 శాతం వడ్డీ , మానసిక వేదన కలిగించినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా బాధితుడికి అందజేయాలని ఆదేశించారు.

మ్యూజిక్ ఫెస్టివల్‌కు పక్కా ఏర్పాట్లు

పటమట(విజయవాడతూర్పు): దుర్గా ఘాట్‌లో డిసెంబర్ ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు 'కృష్ణవేణి సంగీత నీరాజనం' పేరుతో జరిగే మ్యూజిక్ ఫెస్టివల్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం దుర్గా ఘాట్‌లో మ్యూజిక్ ఫెస్టివల్ జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే ఈ ఫెస్టివల్‌లో నదీ తారాన కర్నాటిక్ సంగీతం ఉంటుందన్నారు. ఈ వేడుకలకు భాగస్వాములైన దేవదాయ, టూరిజం అధికారుతో వీఎంసీ అధికారులు సమన్వయం చేసుకుని వేడుకలు వైభవంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జోనల్ కమిషనర్-1 రమ్య కీర్తన, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్ యాప్ ప్రారంభం



యాప్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'దేశ్ కా ప్రకృతి పరీక్షణ అభియాన్' యాప్‌ను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మంగళవారం ప్రారంభించారు. కలెక్టరేట్ సమావేశ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఇది ఒక ఆయుర్వేదం యాప్ అని, దీనిని ఆరోగ్య సంరక్షణకు ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆయుర్వేద పద్ధతిలో ఆరోగ్య సూచనలు, ఆహార నియమాలు పాటించేందుకు అనుకూల మార్గదర్శకాలు అందిస్తుందన్నారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి అనుకూల ఆహార అలవాట్లు, జీవన శైలి మార్గదర్శకాలను అందించటం, ఆరోగ్య సంరక్షణ కోసం ఆయుర్వేద పద్ధతులను ప్రోత్సహించటం యాప్ ఉద్దేశమన్నారు. ఈ యాప్‌ను దేశవ్యాప్తంగా డిసెంబర్ 25వ తేదీ వరకు ఆయుర్వేద కళాశాలలు, ఆస్పత్రి, డిస్పెన్సరీల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ యాప్‌ను వినియోగించుకుని వారి శరీర ధర్మ స్వభావాన్ని అంచనా వేసుకోవచ్చని, ఆయుర్వేద సూచనలు పొందవచ్చని సూచించారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి ఒక్కరూ ఆయుర్వేదం ద్వారా ఆరోగ్య సంరక్షణను చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆయుర్వేద వైద్యులు మాధవి, రత్నకుమారి, ఉషారాణి, జావెద్‌ఖాన్, సుభాష్‌చంద్రబోస్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.